సమస్యల వలయంలో కేజీబీవీ

- మౌలిక వసతులు లేక అవస్థలు
- పాఠశాలకు శాపంగా మారిన బావిగుంత
- డార్మెటరీల్లో కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఎర్రవల్లి చౌరస్తాలోని కస్తూర్బా పాఠశాల

ఎర్రవల్లి: బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను స్థాపించింది. కానీ పలు పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను పుట్టెడు సమస్యలు వెంటాడుతుండటంతో నిత్యం వాటితో సాహసం చేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. పాఠశాలలో రాత్రివేళల్లో బాలికలు చదువుకోవడానికి సరైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో మబ్బులోనే చదవాల్సి వస్తోంది. ఫ్యాన్లు పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో ఈగలు, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా బావిగుంత..

పాఠశాలను నిర్మించే క్రమంలో భవనం కోసం ఆవరణలో మట్టిని తవ్వడంతో పెద్దబావి గుంత ఏర్పడింది. ఇది పాఠశాలకు ఆనుకొని ఉండటంతో నిత్యం విషసర్పాలు సంచరిస్తున్నాయి. వర్షాకాలంలో బావిగుంత నీటితో నిండటంతో మురుగు ఏర్పడి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

ప్రహరీ లేక అవస్థలు.

పాఠశాలకు పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించకపోవడంతో నిత్యం పశువులు, గొర్రెలు సంచరిస్తున్నాయి. వాటివల్ల నిత్యం భోజనం చేసే సమయంలో దుర్వాసన వెదజల్లుతోంది. పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యేలకు విన్నవిస్తే, వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని అనేకసార్లు హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బాలికలు వేడుకుంటున్నారు.


పాఠశాలకు ఆనుకొని ఉన్న పెద్ద బావిగుంత


ప్రహరీ లేక గుండ్లతో ఉన్న పాఠశాల ఆవరణం

నిత్యం భయంగా గడుపుతున్నాం..



పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ప్రతిరోజు ఆవరణలోకి విషపురుగులు రావటంతో నిత్యం భయపడుతూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించి సమస్యను పరిష్కరించాలి.
– లావణ్య, 8వ తరగతి

విష జ్వరాల బారిన పడుతున్నాం.



పాఠశాల ఆవరణంలో ఉన్న పెద్ద బావిగుంతలో మురుగు నిండడంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెంది రాత్రివేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో పాటుగా వర్షాకాలంలో అధికంగా విష జ్వరాల బారిన పడుతున్నాం. స్పందించి బావిగుంతను త్వరగా పూడ్చివేయాలి.
– జయలక్ష్మి, 7వ తరగతి

దాతలు ముందుకు రావాలి

ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కొరత కారణంగా పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించలేకపోతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దాతలు ఎవరైనా ముందుకొచ్చి సహాయం అందిస్తే బావి గుంతను పూడ్చడంతో పాటుగా పాఠశాలలోని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతాయి.
– ఆసియా బేగం, పాఠశాల ప్రత్యేక అధికారి

క్లుప్తంగా

వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు



అలంపూర్: మహిళలను, విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని సీటీఎం సభ్యులు హెచ్చరించారు. అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో విద్యార్థినులకు షీటీం సేవలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలల్లో వేధింపులకు గురైనప్పుడు షీటీంను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికలు సురక్షితంగా ఉండుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు దివ్యవాణి, లోకేశ్వరి, శేషన్న, హన్మంతు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఆర్థికంగా బలోపేతం కావాలి



అయిజ: కుల వృత్తిని కొనసాగిస్తున్న చేనేత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకొని బలోపేతం కావాలని చేనేత జిల్లా అధికారి ఉపేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న త్రిఫ్ట్ ఫండ్‌కు సంబంధించిన పొదుపు పథకం ఫారాలను అందజేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



అయిజ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'చార్ సౌ బీస్' పరిపాలన చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందన్నారు. ఇంత వరకు రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. హామీలు నెరవేర్చని రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చునే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, వెంకట్రాములు, లక్ష్మణ్ గౌడ్, రాజు, కృష్ణం రాజు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో తనిఖీ

మానవపాడు: మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మీసేవ కేంద్రాల్లో సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



ఎర్రవల్లి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఏఎస్‌ఐ సుధాకర్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి టిప్పర్‌లో అక్రమంగా గద్వాల జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తెల్లవారుజామున జింకలపల్లి స్టేజీ సమీపంలో టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టిప్పర్‌ను పీఎస్‌కు తరలించి జనుంపల్లికి చెందిన డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

'పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని ఆందోళన'

అమరచింత: మండల కేంద్రంలోని బాలాజీ ఫిల్లింగ్ కేంద్రంలో గురువారం పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌స్వామి గురువారం తన మోటర్ సైకిల్‌కు బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్‌లో లీటరు పెట్రోల్ పోయించాడు. మోటర్ సైకిల్ కొద్ది దూరం వెళ్లి ఆగిపోవడంతో మెకానిక్ దగ్గరికి తీసుకెళ్లగా.. పెట్రోల్‌లో నీళ్లు ఉన్నాయని చెప్పడంతో వాటిని బాటిల్‌లో పోసుకుని బంక్ వద్దకు వచ్చి వాదనకు దిగాడు. బంకు యాజమాని శంకర్‌నాయక్ తమ బంక్‌లో కల్తీ జరగదని బకెట్‌లో పెట్రోల్ నింపి చూపించాడు. ఎవరో గిట్టని వ్యక్తులు ఇలా తమ బంక్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని గురువారం గద్వాల సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలోని గ్రామప్రజలకు లేబర్ కార్డు నమోదు కార్డు పొందుట వల్ల లబ్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే తాపీ మేస్త్రీ పెయింటర్, కార్పెంటర్ 50 రకాల బిల్డింగ్ కార్మికులు అర్హులన్నారు. కార్మికులు మీసేవలో కేవలం రూ.110 రుసుం చెల్లించి, ఎంట్రీ చేయించి లేబర్ ఆఫీసులో నేరుగా సంప్రదించి కార్డులు పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు మోహిన్ పాష, మాజీ సర్పంచు ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మికులు రంగస్వామి, రవి, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులకు నీటి సమస్య

గద్వాల క్రైం: గద్వాల ఆర్టీసీ కార్మికులకు వారం రోజులుగా మంచి నీటి సమస్య తలెత్తిందని వికార్మికులు వాపోతున్నారు. డిపో వెలుపల గ్యారెజ్‌లో పని చేసే కార్మికులకు మంచి నీటి అవసరాల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వారం రోజులుగా నీటిని శుద్ధి చేసే యంత్రాలు సాంకేతిక సమస్యతో పని చేయడం లేదు. ఈ విషయంపై డిపో మేనేజర్ మురళీకృష్ణను సంప్రదించగా మోటార్ ఫెయిల్ అవ్వడంతో సమస్య తలెత్తిందన్నారు. పని చేసే కార్మికులకు నీటి సమస్య లేకుండా బయటి మార్కెట్‌లోంచి కాయిన్‌లను మంచి నీళ్లను అందుచేస్తున్నామన్నారు.

బాలికల చదువుకు కృషి చేయాలి

మల్దకల్: బాలికల చదువుకు తల్లిదండ్రులు కృషి చేసి వారిని జీవితంలో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటు అందించాలని ఫైనాన్సియల్ లిటరసీ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని అమరవాయి అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేటీ 'బచావో..బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా 10వ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 1098, 181, 1930, 100, 108హెల్ప్‌లైన్ సేవల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఎడ్యుకేటరు కృష్ణయ్య, సరోజ, అంగన్‌వాడీ టీచర్లు పద్మమ్మ, యశోదమ్మ, తిమ్మమ్మలు పాల్గొన్నారు.


అమరవాయిలో మాట్లాడుతున్న సరోజ

జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమం


మానవపాడులో వైద్యసిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సింధు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం డాక్టర్ సింధు ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందికి, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రవేట్ కళాశాలలో 1-19 సంవత్సరం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. విద్యార్థులలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలిలేకపోవడం, బలహీనత, ఆందోళన, వికారం, కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటే నులిపురుగు సంక్రమణ ఉన్నట్లని తెలిపారు. కార్యక్రమంలో వీణసాయి, హెలెన్, చంద్రన్న, తిరుమల్‌రావు, అక్కమ్మ, సంధ్య, ప్రసన్న, మాబి, రాణి, రేచల్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


క్యాతూర్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి ప్రియాంక

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

అలంపూర్ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక సూచించారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఎన్‌డీడీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి ప్రియాంక మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సత్యనారయణ, హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కృషి చేయాలి

అయిజ: సింగిల్ విండో ద్వారా రైతులు అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిరాణి అన్నారు. సాధారణ తనిఖీలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని, ఫెస్టిసైడ్ దుకాణాన్ని, సూపర్ మార్కెట్లను జ్యోతిరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించిన సొసైటీల్లో అయిజ సొసైటీ ఒకటన్నారు. అయిజ సింగిల్ విండో ద్వారా చిరు వ్యాపారస్తులకు రుణాలు ఇచ్చేందుకు రూ.కోటి ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ప్రసిడెంట్ మధుసూదన్ రెడ్డి, డీసీసీబీ గద్వాల బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, పీఏసీఎస్ కార్యదర్శి మల్లేష్, జీవన్, భక్త ప్రహ్లాద, రాజు, కళావతి, సంధ్య, భూమిక పాల్గొన్నారు.


సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ జ్యోతిరాణి

బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి అవసరం

రాజోళి: బాలలకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ, అక్కడక్కడా పలువురు బాల్యవివాహాలకు పాల్పడటం దురదృష్టకరమని ఓఆర్‌డబ్ల్యూ(చైల్డ్ వెల్ఫేర్ అధికారి) లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో గురువారం మహిళా సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగినట్లెతై మహిళా సంఘాల వారు పసిగట్టి బాలల హక్కుల పరిరక్షణ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. బాలలను కార్మికులుగా మార్చే వారిపై చట్టపరంగా కఠిన శిక్షలు అమలవుతాయనే విషయాన్ని గ్రామాల్లో అందరికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మార్తమ్మ, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఐకేపీ భవనంలో మహిళాసంఘాల సమావేశం

సత్యనారాయణస్వామి హోమం

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో గురువారం బాలయోగి శివనారాయణస్వామి ఉత్సవాల సందర్భంగా లక్ష్మీగణపతి పూజ, సుదర్శన హోమం, సత్యనారాయణస్వామి హోమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా కబడ్డీ, స్లో బైక్, భజన పోటీలు నిర్వహించారు. ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి ప్రజలు, భక్తులు వస్తారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు సతీష్‌రెడ్డి, వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో హోమం




అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని న్యూప్లాట్స్, బీసీ కాలనీలో అభయ ఆంజనేయ స్వామి సన్నిధిలో గురువారం ధ్వజస్తంభం ఏర్పాటులో భాగంగా హోమం నిర్వహించారు. గణపతి హోమం తో పాటు భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు మనోహరమ్మ మహేశ్వర్‌గౌడ్, అనురాధ గంగరాజ్ ప్రసాద్, జయలక్ష్మీనాగరాజ్ యాదవులు హోమం నిర్వహించారు.

నేడు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

అలంపూర్ పట్టణంలోని బీసీ కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠ, లింగమయ్య, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

చిన్నతాండ్రపాడు వాసికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అవార్డు


వినోద్‌కుమార్

అయిజ: లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి బెస్ట్ యంగ్ ఎంటర్ ప్రైనర్‌గా జోగుళాంబ గద్వాల జిల్లాలోని చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన కె.వినోద్‌కుమార్ ఎంపికయ్యారు. ప్రముఖ అంతర్జాతీయ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు అవార్డ్‌ను ప్రకటించారు. మార్చి 21న ఇంగ్లాండ్ దేశంలోని లండన్‌లో వరల్డ్ లీడర్స్ సమ్మిట్ ప్రోగ్రాంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. 2018లో స్టార్ క్యూబెక్స్, స్టార్ పవరెక్స్ సర్వీసెస్ లిమిటెడ్ అనే కంపెనీ స్థాపించి 800కు పైగా యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు ఈ అవార్డును లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. పలువురు ప్రముఖులు వినోద్‌కుమార్‌ను అభినందించారు.

అయిల్‌పామ్ తోటను పరిశీలించిన మాజీ మంత్రి



గట్టు: మండలంలోని మిట్టదొడ్డి గ్రామానికి చెందిన రైతు నర్సింహారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను గురువారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. అయిజ నుంచి బల్గెరకు వెళ్తున్న క్రమంలో మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. మూడేళ్ల కాలంలో ఆయిల్‌పామ్ తోట ఏపుగా పెరిగి కాపు వచ్చిన విషయాన్ని గమనించారు. రైతు నర్సింహారెడ్డితో ఆయిల్‌పామ్ తోట సాగు గురించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్వ పల్లయ్య, భద్రయ్య, వేమారెడ్డి, జమాలుద్దీన్, మత్తాలి, వీరేష్ పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తతపై అవగాహన

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జోగు రవి ఆధ్వర్యంలో చట్టబద్ధమైన దత్తత గురించి ఆశలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లలను అమ్మడం, కొనడం చట్ట విరుద్ధంగా పెంచుకోవడం నేరామని తెలిపారు. బాలుడిని, బాలికను అమ్మిన, కొన్న ఐదేళ్ల వరకు కఠినకారాగా శిక్ష, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ద్వారా సులభంగా, న్యాయబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.


మానవపాడులో ఆశలకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జోగు రవి

ఘనంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

ధరూరు: పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అలంకరణ, మధ్వ నవమి, పల్లకీసేవ నిర్వహించారు. కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సెక్రటరీ గద్వాల జిల్లా న్యాయ సేవా సదన్ గంటా కవితాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.


ఆలయంలో పూజలో పాల్గొన్న సెక్రటరీ గద్వాల జిల్లా న్యాయ సేవా సదన్ గంటా కవితాదేవి

కార్మికులకు అవగాహన సదస్సు


గుడ్డెందొడ్డిలో అవగాహన కల్పిస్తున్న సహాయ లేబర్ అధికారి వేణుగోపాల్

ధరూరు: భవన నిర్మాణ కార్మికులకు వివిధ అంశాలపై గద్వాల సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్ అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ రంగంతో పాటు పెయింటర్, ఎలక్ట్రీషియన్ ఇతర కార్మిక రంగాల్లో పని చేసే వారికి ప్రభుత్వం లేబర్ కార్డులను జారీ చేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు వారు మీ సేవ కేంద్రాల్లో రూ.110 చెల్లించి అప్లికేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు మోహిన్‌పాష, సీఐటీయూ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింతరేవుల కృష్ణ, కార్మికులు పరశురాముడు, గోవిందు, కేశవులు, మునెప్ప, ఆంజనేయులు, నర్సింహులు పాల్గొన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న వృషభాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, తొత్తినోనిదొడ్డి గ్రామంలో గుండ్ల బీమరాయ స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగు పోటీలు ముగిశాయి. గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ విభాగం వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన బాస్కెట్ బాల్ (మెన్, ఉమెన్) టోర్నమెంట్ ముగిసింది. ఇసుక సంచి ఎత్తుపోటీ, సందరాళ్లు ఎత్తు పోటీ, దొబ్బుడు గుండ్లు ఎత్తు పోటీ, గుబ్బల గుండ్లు ఎత్తుపోటీలు ముగిశాయి. తొత్తినోనిదొడ్డిలో నిర్వహించిన సీనియర్ విభాగం వృషభాల బండలాగు పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ప్రజలు వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చారు.


బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న స్నిగ్ధా రెడ్డి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ యూనియన్, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవ్ -2025లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు చక్రపాణిరెడ్డి, షకీల్‌అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.